

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అర్చకులకు మేలుచేసే జివో పట్ల హర్షం

-జిల్లా డిడిఏ సంఘం ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య

**వర్గల్, జూన్ 11, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలోని అర్చకులకు మేలు చేసేవిధంగా జివోను విడుదల చేయడం పట్ల సిద్దిపేట జిల్లా ధూపదీపనైవేద్య అర్చకసంఘం ప్రధానకార్యదర్శి జంగం వీరభద్రయ్య హర్షం వ్యక్తంచేశారు. బుధవారం హైద్రాబాద్‌లోని బొగ్గులకుంట ఎండోమెంట్ కమీషనర్ కార్యాలయం ఆవరణలో సిఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖల చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేయగా ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నందబాలశర్మతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరభద్రయ్య మాట్లాడుతూ అర్చకులసంక్షేమనిధికి నిధులను పెంచుతూ జివోను విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్ముందు ఎంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ధూపదీపనైవేద్యసంఘం రాష్ట్రకన్వీనర్ నందనం హరికిషన్‌శర్మ, కన్వీనర్ శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు, అన్నిజిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అర్చకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-రాజీమార్గం రాజమార్గం: సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త:**
జాతీయ మెగా లోక్ అదాలత్ ఈనెల 14న నిర్వహించడం జరుగుతుందని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిపి డాక్టర్ అనురాధ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుదూ రాజీమార్గం, రాజమార్గమని సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలన్నారు. కక్ష, కారుణ్యాలతో ఏమీ సాధించలేమన్నారు. రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని తెలిపారు. లోక్ ఆదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కొట్టుకుంటే ఒకరే గెలుస్తారని.. రాజీపడితే ఇద్దరూ గెలుస్తారని తెలిపారు. పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ మనుచౌదరి



భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న జిల్లాకలెక్టర్ మనుచౌదరి

**కొమురవెల్లి, జూన్ 11, ప్రభాతవార్త:**
భూసమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషిచేయాలని జిల్లాకలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. మండలపరిధిలోకి కిష్టంపేట గ్రామంలో బుధవారం నూతన ఆర్ఓఆర్ చట్టం-భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ సదస్సును పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తిచేసి పరిష్కరించాలన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార, వాణిజ్య సంస్థలు లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి

-మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్



మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:**
పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ ట్రేడ్ లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణ పరిశుభ్రతపై 100రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా పట్టణంలోని ఎల్లమ్మతల్లి దేవాలయం వద్ద పరిసర ప్రాంతాలలో జెసిబిల సహాయంతో మురుగుకాలువలను శుభ్రం చేయించారు. అనంతరం మున్సిపల్ మేనేజరు సంపత్‌కుమార్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్యసంస్థలు వారి లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని కోరుతూ దుకాణాదారులకు నోటీసులు అందజేశారు. అనంతరం పట్టణంలోని 20వ వార్డులో బేజిల్ ఫౌండేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుబిఐ బ్యాంక్ మేనేజరు సంజీవ్, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్లు సువార్త, మమత, ప్రసాద్, శారద, పద్మ, రాజు, శ్రావణితోపాటు మెప్మా రిసోర్స్ పర్సన్‌లు ఉన్నారు.

## అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..?



చౌటపల్లిలో ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్/అక్కన్నపేట, జూన్ 11, ప్రభాతవార్త:**
అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామంలో అర్హులకు కాకుండా అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని గ్రామస్థులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకుంటామని స్వయంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు హామీ ఇవ్వడంతో పాటు అధికారులకు ఆదేశాలు జారీచేసినా అధికారులు, కాంగ్రెస్‌పార్టీకిచెందిన గ్రామశాఖ అధ్యక్షులతో కుమ్మక్కై ఇళ్లులేని అర్హులు ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి మంజూరైన పదహారు ఇళ్లలో దాదాపు ఐదు ఇళ్లవరకు మూడునుండి పన్నెండెకరాల భూమితోపాటు ఆర్థికంగా బలంగా ఉన్న వారిని అర్హుల జాబితాలో చేర్చి వారినుండి డబ్బులు వసూళ్లుచేసి మరీ వారికి ఇళ్లు మంజూరు చేశారని అదేపార్టీకిచెందిన నాయకులతోపాటు గ్రామస్థులు బాహాటంగానే చెబుతున్నారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిన స్పెషల్ ఆఫీసర్లతోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కెసిఆర్‌కు మద్దతుగా తరలిన టిఆర్ఎస్ నేతలు

**నర్సాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమనేత మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హైదరాబాదులోని బిఆర్‌కె భవన్‌లో కాళేశ్వరంపై ఏర్పాటుచేసిన కమిషన్ ముందుకు హాజరయ్యారు. ఈమేరకు కెసిఆర్‌కు మద్దతుగా టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లడం జరిగింది. ఈసందర్భంగా తెలంగాణ తొలిముఖ్యమంత్రి ఉద్యమనేత మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావుకు మద్దతు తెలపడానికి రాష్ట్ర ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ నిజాయితీగా ఉన్నందున ఎలాంటి కల్మషం లేనివ్యక్తిగా బయటపడతారన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ మాజీచైర్మన్ అశోక్‌గౌడ్, చంద్రగౌడ్, రమణగౌడ్, మన్సూర్, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, దేవాగౌడ్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-మండల పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

**కొండపాక, జూన్ 11, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్‌పల్లిలో ప్రధాని పిలుపు మేరకు ఎంపి రఘునందన్‌రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్ అదేశాలతో బుధవారం మా కే నామ్ పే ఎక్ పేడ్(తల్లిపేరు మీద ఒక మొక్క) కార్యక్రమాన్ని బిజెపిమండల పార్టీ అధ్యక్షుడు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్యావరణ దినోత్సవాల్లో భాగంగా ప్రతిబూత్‌లో మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రామ బూత్ అధ్యక్షుడు కొక్కొండ రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు బోనాల రాజు, సమక్షంలో అమ్మ పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గౌరారం కృష్ణ, సదానందగౌడ్, గట్టు అనిల్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు యాదగిరి, రాజశేఖర్, నరేష్‌రెడ్డి, స్వామి, చందు, చంద్రం, అంజనేయులు, రాజు, యాదగిరి, సుధాకర్, ప్రభాకర్, అసిఫ్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బిజెపి నాయకులు

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

-రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పందిల్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు మాందాటి వెంకట్‌రెడ్డి పొలంలో ఎడ్లతో నాగలిదున్ని వారితోనే పెసర విత్తనాలను చల్లారు. ముందుగా రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి మొదలైన నేపథ్యంలో రైతులు విత్తనాలు సాగు చేసుకుంటారని ఈసారి నియోజకవర్గంలో ఒక్క గుంట కూడా బీడు భూమి కనిపించకుండా భూములు సాగు చేయాలన్నారు. రైతులకు కావాల్సిన విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయంతో పాటు వారు పండించిన పంటకు మద్దతు ధరలను అందిస్తుందన్నారు. ఈసారి వర్షాలు సంమృద్ధిగాపడి రాష్ట్రంలో రైతుల పంటలకు మంచి దిగుబడితో పాటు దిగుబడి నిచ్చిన పంటలకు ఉత్పత్తులు పెరిగి దేశంలోనే ఉత్పత్తులు ఎగుమతిచేసే రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రైతులు చేసే శ్రమకు తగిన విధంగా ప్రకృతి సహకరించాలని భగవంతుని వేడుకున్నారు. నియోజకవర్గంలో బీడు భూములు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత రైతులపైనే ఉందన్నారు. సాగు చేసుకునేందుకు విత్తనాలు కొనుగోలు చేసే స్తోమత కూడా లేని రైతులు తమ క్యాంప్ కార్యాలయంలో సంప్రతించాలని వారికి విత్తనాలను ఇప్పించే బాధ్యత తానే తీసుకుంటానన్నారు. అధునాతన టెక్నాలజీతో అధికలాభాలు వచ్చేవిధంగా ఈప్రాంతంలో మూడురోజులు రైతు మహోత్సవ కార్యక్రమాలు ఏర్పాటుచేసి వేలాది మంది రైతులకు లాభసాటి పంటలసాగు గురించి అధికారులతో అవగాహన కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. అంతకుముందు పట్టణంలోని రేణుక ఎల్లమ్మతల్లి జాతర ముగింపుసందర్భంగా దేవాలయంలో అమ్మవారికి వెండి తొడుగులు అలంకరణ చేసి చండీహోమంలో వారి కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తితో పాటు తదితరులు ఉన్నారు.



నాగలి పట్టి దున్నుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి

-సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, జూన్ 11, ప్రభాతవార్త ప్రతినిధి:**
మహిళలు వ్యాపార మెలకువలు తెలుసుకొని పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. సిద్దిపేట ఐటి టవర్‌లో బుధవారం శుభిక్షా అగ్రి ఫౌండేషన్ సహకారంతో వీ హబ్ వారు మహిళలకు వ్యాపార రంగాలలో మెలకువలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారతలో భాగంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీ హబ్ రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వం పక్షణ బ్యాంకు లింకేజీ, వడ్డీలేని రుణాలను ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా రాణించాలన్నారు. హుస్నాబాద్ మండలం సుముద్రాల గ్రామంలో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటుచేసి మహిళాసంఘాలచే ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా విస్తారాకుల ప్లేట్లతయారీ యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వీ హబ్ సిఈఓ సీత తదితరులు మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం రూ.లక్ష 27,500 ఆర్థికసహాయాన్ని శుభిక్షా అగ్రి ఫౌండేషన్‌కు జిల్లాకలెక్టర్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏపిడి జయదేవ్ ఆర్యా, ఫౌండేషన్ ప్రతినిధులు నరేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**డ్రగ్స్, గంజాయి, ఆల్ప్రాజోలం అంతం చేయడానికి ఎలాంటి చర్యలకైనా వెనకాడబోము..**
తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో హైదారాబాద్(డిఎస్పి) పుష్పన్‌కుమార్ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని కలిసి జిల్లాలో డ్రగ్స్, గంజాయి, ఇతరత్రా మత్తు పదార్థాల వినియోగాన్ని అంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, గంజాయి, కల్లుదుకాణంలో ఆల్ప్రాజోలంలాంటి వినియోగాన్ని పూర్తిగా అంతం చేయడానికి ఎలాంటి చర్యలకైనా వెనకాడబోమని తెలిపారు. నేటియువతకు శాపంగామారిన డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని నివారించేందుకు జిల్లాలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో జారీచేసిన గోడపత్రికను ఆవిష్కరించారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:**
గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూసదస్సులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం నర్సాపూర్ మండలపరిధిలోని చిప్పల్‌తుర్తిగ్రామంలో ఏర్పాటుచేసిన భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రైతులకు ఉన్న భూసమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని రైతులు తప్పనిసరిగా భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 187గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించామని ఈసదస్సులో 10933 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని ఆయన తెలిపారు. దరఖాస్తులను పరిశీలిస్తూతెలియని అంశాలు ఉంటే అధికారులను అడిగితెలుసుకోవాలని రైతులకు సూచించారు. దరఖాస్తులలో ఎలాంటి పొరపాట్లు చేయరాదని అన్నారు. ఈమేరకు గ్రామాల్లోని రైతులు ప్రజలు తమకున్న భూసమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తులుచేసుకొని పరిష్కరించుకోవాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు మహిపాల్‌రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూసిబ్బంది చిప్పల్‌తుర్తిగ్రామ నాయకులు గ్రామ మాజీసర్పంచ్ శ్యామల లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్, వడ్ల భాస్కర్‌చారి, సురేష్‌గౌడ్, మాజీ మండలకోఆప్షన్ సభ్యులు అమీనుద్దీన్, రాజయ్య, ఎల్లయ్య, అధికారులు, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**శివ్వంపేటలో...**
గురువారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో మహిపాల్‌తో కలిసి జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ భూనమోదులు, రికార్డులు సరుబాటు, వాస్తవికంగా భూసమస్యలపై ఉన్న హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని భూసమస్యలను గ్రామస్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుపై రెవెన్యూ అధికారులకు పలుసూచనలు చేశారు. అనంతరం గ్రామంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆయిల్‌ఫామ్ మొక్కలను పరిశీలించి ఆయిల్‌ఫామ్ సాగుగురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, ఏడిఏ సంధ్యారాణి, ఆయిల్‌ఫామ్ కంపెనీ సిఈవో వీరారెడ్డి, తహసీల్దార్‌కమలాద్రి, ఎంపిడివో నాగేశ్వర్‌గుప్తా, మండల వ్యవసాయ అధికారి లావణ్య, సీనియర్ అసిస్టెంట్ నిరంజన్, మాజీసర్పంచ్ సోనీ రవినాయక్, రెవెన్యూసిబ్బంది, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## ఇంటర్‌లో విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచాలి

-అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 11, ప్రభాతవార్త:**
ఇంటర్‌లో విద్యార్థులసంఖ్య పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు) చంద్రశేఖర్ ఇంటర్‌బోర్డు అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్ విద్య అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంటర్‌కళాశాలల్లో విద్యార్థులసంఖ్య పెంచాలని, డ్రాప్‌అవుట్స్ తగ్గించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నమోదును పెంచడానికి కార్యాచరణ చేయాలన్నారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని, సంగారెడ్డిపట్టణంలోని హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుచేయాలని అన్నారు. జూనియర్ కళాశాలలసిబ్బంది ద్వారా ప్రవేశాలనువేగవంతంచేయాలని పేర్కొన్నారు. బాల్యవివాహాల కారణంగా, పదకొండవతరగతి నుండి పన్నెండోతరగతివరకు చదువు మధ్యలో మానేయడం పెరుగుతోందనీ దాన్ని నిరోధించాలని అన్నారు. ప్రిన్సిపల్స్ డ్రాప్ అవుట్ సర్వే నిర్వహించి కారణాలను సమర్పించవలసిందిగా ఆదేశించారు. మౌలికసదుపాయాలు అవసరమయ్యే కళాశాలల్లో జహీరాబాద్, ఝర్రా, కల్హేర్, నారాయణఖేడ్, కోహీర్, జోగిపేట్, హద్నూర్, పుల్కల్, న్యాల్కల్, పటాన్చెరు, సంగారెడ్డి(బాలుర), సదాశివపేటల్లో త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.

## అంగన్‌వాడీ పిల్లల కోసం ర్యాలీ

**శివ్వంపేట, జూన్ 11, ప్రభాతవార్త:**
అంగన్వాడీలో పిల్లలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించేందుకే ఎగ్ బిర్యానీ అని ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోష అన్నారు. బుధవారం మండలకేంద్రమైన శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ వండి పెట్టే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోష తెలిపారు. అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో నూతనంగా వచ్చే అంగన్వాడీ పిల్లల కోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గృహ సందర్శన చేసి ప్రతి పిల్లవాని అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోష మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం పిల్లలకు పోషక ఆహారాన్నించేందుకే ఎగ్ బిర్యానీ పథకాన్ని ప్రారంభించిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కృష్ణవేణి, నవీన, పిల్లలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితునికి 2 యేండ్ల కఠిన కారాగార శిక్ష

-రూ.30 వేల జరిమానా

**సిద్దిపేట రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:**
పోక్సో కేసులో నిందితునికి 2యేండ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి వై.జయప్రసాద్ బుధవారం తీర్పునిచ్చినట్లు సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు. అమె అందించిన వివరాలు ప్రకారం, రూరల్ పోలీసుపరిధిలోని గ్రామంలో మైనర్ అమ్మాయి కిరాణాషాప్‌కి వెళ్తుండగా, రాందేని అరవింద్(23) నిన్ను ప్రేమిస్తున్నానని వెంటపడి చేయిపట్టి గుంజినట్లు బాధితులు 2009 డిసెంబర్‌లో ఫిర్యాదుచేయడంతో అప్పటి ఎస్ఐ శంకర్ కేసు నమోదుచేసి పరిశోధన ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటినుంచి నేటివరకు కోర్టులో కేసు విచారణ కొనసాగుతూ వచ్చిందన్నారు. ఇరువురి వాదనలు విన్నతర్వాత నేరస్తుని నేరం రుజువుకావడంతో నేరస్తునికి 2యేండ్ల కఠిన కారాగారశిక్ష రూ.30వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు తెలిపారు. నేరస్తునికి శిక్షపడడానికి ఎస్ఐ అపూర్వరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ రవి, కోర్టు లైజనింగ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, లోకేశ్వర్, లోకేష్, భరోసాసెంటర్ సిబ్బంది సౌమ్య, హరిత, కీలకపాత్ర వహించారు. కేసు విచారణ చేసిన ఎస్ఐతో పాటు కోర్టువిధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సిపి డాక్టర్ అనురాధ అభినందించి త్వరలోనే నగదు పురస్కారం అందజేస్తానని తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ములుగు, జూన్ 11, ప్రభాతవార్త:**
కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలకుగురైన వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారంరాత్రి మృతిచెందాడు. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మేడ్చల్‌మండలం దొంగలగుట్టతండాకుచెందిన కోడావత్ రాములు (47) అనే వ్యక్తి ఈనెల 5వ తేదీన పనినిమిత్తం ద్విచక్రవాహనంపై కొత్తూరు గ్రామానికి వచ్చి తిరిగివెళ్తుండగా కొత్తూరుగ్రామ శివారులో టిఎస్36ఎం 6688 నెంబర్‌గల కారు ఢీకొట్టింది. దీంతో రాములుకు తీవ్రగాయాలు కాగా లక్ష్మక్కపల్లిలోని ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 10.30 గంటలకు మృతిచెందాడు. మృతుని కుమారుడు విఠల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ బోయిని సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సీతారామ వీరాంజనేయ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 11 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలిలోని శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామి, శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి వార్ల దేవాస్థానముల 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని వంశ పారంపర్య ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాస్ చారి తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దూద్‌బౌలి ఉందాబజార్‌లో శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామి, శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి వార్ల దేవాస్థానముల బ్రహ్మోత్సవాలను ఘనంగా జరపటానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలియజేశారు. 12వ తేదీన శ్రీ సత్యనారాయణ స్వామి వారికి సామూహిక తులసీ అర్చన, 13న శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి కళ్యాణం, 14వ తేదీన శ్రీ సీతారాముల కళ్యాణం, 16వ తేదీన పల్లకి ఊరేగింపు సేవా తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి
### : టిపిసిసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్



టిపిసిసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన అల్లం భాస్కర్, కొప్పుల ప్రవీణ్ కుమార్‌లను కాంగ్రెస్ నాయకులు సన్మానిస్తున్న దృశ్యం

**చార్మినార్, జూన్ 11 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నదని టిపిసిసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ అన్నారు. చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి టిపిసిసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన పాతబస్తీకి చెందిన అల్లం భాస్కర్, కొప్పుల ప్రవీణ్ కుమార్‌లను బుధవారం శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా టిపిసిసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### గౌలిపుర వరద ముప్పు జేపసి ఆధ్వర్యంలో నిరసన

**చార్మినార్, జూన్ 11 ప్రభాతవార్త :** పాతబస్తీ గౌలిపుర వరద ముప్పు జేపసీ ఆధ్వర్యంలో మంగళవారం జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కార్యాలయంముందు నిరసన వ్యక్తం చేశారు. అచ్చయ్య నగర్, హనుమాన్ నగర్, ఫేజ్ 1, 2, అంబిక నగర్, అయోధ్య నగర్, శ్రీ రామ్ నగర్ కాలనీ, పటేల్ నగర్ కాలనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలు నుంచి వరద ముప్పు వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. వరద ముప్పు సమస్యను పరిష్కరించాలని కోరుతూ జేపసీ ప్రతి నిధులు జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, డిఎంసి మంగతాయల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశిష్, గోపీ, నరసింహగౌడ్, చంద్ర మోహన్ గౌడ్, శివ చంద్రగిరి, శ్రీ రాములు, దేవేందర్, నలిని, అనిత, సాయి, నరహరి, రాకేష్, రాజు పలువురు పాల్గొన్నారు.

## అమ్మ మాట...అంగన్‌వాడీ బాట



**అత్తాపూర్ జూన్ 11, ప్రభాతవార్త :**
మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్ పరిధిలో మంగళవారం అమ్మ మాట... అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి, తల్లుల పాత్రను గుర్తించేందుకు, బాలల ఆరోగ్యం, విద్యపై దృష్టి పెట్టేందుకు ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలిపురం అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సునీత, పద్మశాలిపురం 1 టీచర్ కూడికల రాజేశ్వరి, పద్మశాలిపురం2 టీచర్ టి. వెంకటమ్మ, బాబుల్ రెడ్డి నగర్ సెంటర్1 టీచర్ కనకవ్వ (లక్ష్మి), సెంటర్ 2 టీచర్ అనితలు తమ కేంద్రాల్లో పిల్లలతో అనేక సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో, పిల్లలు తల్లులచే ఆరోగ్య నినాదాలతో కూడిన ర్యాలీలు చేపట్టారు. పద్మశాలిపురం మరియు బాబుల్ రెడ్డి నగర్ ప్రాంతాల్లో వీధివీధిగా ప్రభాత ర్యాలీ నిర్వహించి స్థానికులకు అంగన్‌వాడీ సేవలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సి డి పి ఒ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, శారదా మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల ప్రభావం పిల్లల ఆరోగ్యంపై, వారి భవిష్యత్తు విద్యపై ఎంతో ఉంటుంది. మాతృభాషలో మొదటి దశ విద్యను ఇవ్వడం, పోషకాహారం అందించడం ద్వారా సమగ్ర అభివృద్ధికి బీజాంశం వేయబడుతుందన్నారు. స్థానిక నాయకుడు బొల్ల వెంకటేష్ హాజరై మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాలు బాలల అభివృద్ధికి ఆధారశిలలు. అంగన్‌వాడీ టీచర్లు కేవలం ఉపాధ్యా యులు మాత్రమే కాదు, వారు సమాజ మార్గదర్శకులు కూడా. వారికి ప్రభుత్వం, ప్రజలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి అని అభిప్రాయపడ్డారు.

## ఈవిఎం మిషన్ల గోదాం సీఈఓ తనిఖీ

**చార్మినార్, జూన్ 11 ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్, వి, కర్ణన్‌తో కలిసి బుధవారం చుడీబజార్‌లోని ఈవిఎం వేర్ హౌస్‌ను సందర్శించి తనిఖీలు చేశారు. విక్టరీ ప్లే గ్రౌండ్ ఇండోర్ స్టేడియం భవనంలో ఈవిఎం మిషన్లు ఉండటం వల్ల పిల్లలు ఆడుకోవటానికి ఇండోర్ స్టేడియం అందుబాటులో లేదని, చుడీ బజార్, విక్టరీ ప్లే గ్రౌండ్ ఇండోర్ స్టేడియంలో ఉన్న రెండు ప్రదేశాల ఈవిఎం మిషన్ల వేర్ హౌస్‌లను వేరే ప్రాంతానికి తరలించాలని టీపిసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటి కన్వీనర్ పులిపాటి రాజేష్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కోరారని తెలిపారు.

### రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

**అత్తాపూర్ జూన్ 11, ప్రభాతవార్త :** హెల్త్ కేర్ టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న ఫ్యూజీఫిల్మ్ ఇండియా తాజాగా త్వరగా గుర్తించండి, త్వరగా పోరాడండి అనే సీఎస్ఆర్ ప్రచారం ప్రారంభించింది. అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ విభాగం వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసనా కామినేని కొణిదెల దీన్ని ప్రారంభించారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, దాన్ని త్వరగా గుర్తించాల్సిన అవసరంపై ఈ ప్రచారం ప్రధానంగా దృష్టిసారిస్తుంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యం పై కొన్ని అపోహలు ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రచారం ముమ్మరంగా చేస్తారు. దేశంలోని 24 నగరాల్లో ఈ ప్రచారం ఉంటుం ది. ఇది మొత్తం 1.5 లక్షల మంది మహిళలను చేరుకుంటుందని ఆరోగ్యంపై అవగాహన కలిగిన సమాజాన్ని నిర్మించడంలో ఫ్యూజిఫిల్మ్ ఇండియా నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

## జాతీయ విద్యా విధానం విప్లవాత్మక దిశగా ముందుకు సాగుతోంది

### -ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్



ప్రసంగిస్తున్న ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:**
దేశంలో జాతీయ విద్యా విధానం కొత్త ఆవిష్కరణలతో విప్లవాత్మక దిశగా ముందుకు సాగుతోందని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఎఎసి) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ విఎస్.ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 అనేది భారత విద్యా రంగంలో ఒక విప్లవాత్మక దశగా అభివృద్ధి చెందిందని, అందులో భాగంగా ఐడీపీ అనేది ప్రతి విద్యాసంస్థకు ఒక దిశానిర్దేశక పథకంగా ఉపయోగపడేలా రూపొందించబడినదని వివరించారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక ద్వారా విద్యాసంస్థలు తమ బలాబలాలు, అవకాశాలు, మార్గసూచక లక్ష్యాలను గుర్తించి, విద్యా నాణ్యతను మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంస్థ స్వయం విశ్లేషణ ద్వారా తాము ఎక్కడ ఉన్నామో తెలుసుకోవడం, ఎటు పోవాలో నిర్ణయించుకోవడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ధ్యేయాలు – మానవ సామర్థ్యాన్ని వెలికితీయడం, సమానత్వం, న్యాయసమాజం నిర్మాణం, అత్యుత్తమ బోధనా విధానాలు, విద్యలో లౌకికత – అన్నీ ఈ విధానంలో ప్రతిబింబించాల్సిన అంశాలుగా ఆయన చర్చించారు . ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విద్యా సంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణు ప్రియ, ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపల్స్, టీచింగ్ ఫాకల్టీ పాల్గొన్నారు.

## అవినీతిపరులను వదిలే ప్రసక్తే లేదు : మహేష్ కుమార్ గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాగభూషణం, లక్ష్మణ్‌యాదవ్, యాదగిరిగౌడ్, కృష్ణగౌడ్, నిరంజన్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**
కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపరులను వదిలే ప్రసక్తే లేదని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈమేరకు టీపిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన నాగభూషణం బుధవారం మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగభూషణం ను మహేష్ కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం నాగభూషణం ఎంతో కష్టపడి పనిచేశారని పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికలలో అంబర్ పేట్ నియోజకవర్గ ఇన్చార్జిగా అనేక సేవలందించారని తెలిపారు. నాగభూషణం సేవలు పార్టీకి అవసరమని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు . అనంతరం నాగభూషణం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ యాదవ్, లక్‌పతి యాదగిరి గౌడ్ , కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, మాజీ కార్పొరేటర్ నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనానికి వెళ్లి హత్య చేసిన నిందితుల అరెస్ట్

### - వివరాలు వెల్లడించిన పరిగి డిఎస్పి శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న పరిగి డిఎస్పి శ్రీనివాస్

**పరిగి జూన్ 11 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి మండలం , రాపోలు గ్రామంలో ఈనెల 10వ తేదీన అర్ధరాత్రి 1 గంట సమయంలో తల్లి, కొడుకుల పై హత్యాయత్నం జరిగిన ఘటనలో బుధవారం నాడు, నిందితులు పొట్టి చరణ్, గండు చంద్రశేఖర్లను పోలీసులు అరెస్టు చేసి ,రిమాండ్ కు తరలించారు.. బుధవారం డిఎస్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించి, వారు తెలిపిన వివరాల ప్రకారం... రాపోల్ గ్రామానికి చెందిన తల్లి గండు నర్సమ్మ, కుమారుడు గండు రాజేందర్ వారింట్లో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన పొట్టి చరణ్ , వాళ్ళ ఇంట్లో దొంగతనానికి వెళ్లగా, రాజేందర్ నిద్ర మేలుకొని అరవడంతో నిందితుడు పారిపోయాడు.. రాజేందర్ గుర్తుపట్టాడని, ఊర్లో చెప్తే పరువు పోతుందని ఉద్దేశంతో పొట్టి చరణ్ స్నేహితులైన గండు చంద్రశేఖర్, ఇంకొక వ్యక్తితో విషయం తెలపగా రాజేందర్ ను చంపేద్దామనే పథకం వేసి, అదే రాత్రి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న రాజేందర్ పై కత్తి, రాళ్లతో దాడి చేశాడు. రాజేందర్ అరవడంతో వంటగదిలో నిద్రిస్తున్న తల్లి నర్సమ్మ వచ్చి అడ్డుపడగా, నిందితుడు నర్సమ్మని కూడా కత్తితో పొడిచి, తోయడంతో స్పృహ తప్పి పడిపోయింది.. అదే సమయంలో రాజేందర్ ఇంటి బయటకు వెళ్లి అరవడంతో పక్కింటి వాళ్ళు లేస్తారని భయంతో అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. సాక్షాలను తారుమారు చేయడానికి నిందితుడు ఉపయోగించిన కత్తి, ఇనుప రాడ్లను బావిలో పడవేయగా, బావి బయట విరిగిన కత్తి, రక్తంతో తడిచిన టవల్ ను పోలీస్ విచారణలో గుర్తించారు . నిందితుడు తన స్నేహితులతో కలిసి సాక్షాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారని పోలీసు విచారణలో తేలిందని తెలిపారు.. తల్లి గండు నర్సమ్మను చుట్టుపక్కల వాళ్ళు పరిగి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు తెలిపారని, రాజేందర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసు బృందాలు, బుధవారం నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ కు తరలిస్తున్నామని పరిగి డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు.. పరిగి సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై సంతోష్ కుమార్ పత్రికా సమావేశంలో పాల్గొన్నారు,

### మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన జగదీశ్వర్‌గౌడ్



**శేరిలింగంపల్లి, జూన్11 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యున్నతి కోసం పునరంకితమై పనిచేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశకుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ..టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ శేరిలింగంపల్లి నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్రవాయప్తంగా ఉన్న కార్యకర్తలు, నా యకులను కలుపుకుంటూ పార్టీ పటిష్టతకు పనిచేస్తాన ని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రా ష్ట్రాభివృద్ధికోసం కష్టపడిపనిచేస్తానన్నారు. పార్టీ పురోగతి కోసం అలుపులేకుండా పనిచేసేలా ఉత్సాహం నింపిన కాంగ్రెస్ పార్టీ అధిష్టాన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఇద్దరు నకిలీ డాక్టర్లపై కేసు నమోదు

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** అర్హతలు లేకున్నా అక్రమంగా క్లీనిక్ నడుపుతూ పేషెంట్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లపై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్‌లోని బంధన్ ఫంక్షన్‌హాల్ దగ్గర న్యూ ఆల్ షిఫా పేరుతో నుజాత్ సుల్తానా, సాద్ సైపుద్దీన్ అనే ఇద్దరు ఎటువంటి మెడికల్ సర్టిఫికెట్లు లేకుండా క్లీనిక్ ప్రారంభించి, డాక్టర్లుగా వైద్యం చేస్తున్నారు. ఒక్కో పేషెంట్ వద్ద నుండి 100, 150 రూపాయల చొప్పున కన్సల్టేషన్ ఫీజు తీసుకుంటూ ప్రిస్క్రిప్షన్ పై ఏవో మందులు రాసి ఇస్తూ పేషెంట్లను మోసం చేస్తూ ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ముషీరాబాద్ పోలీసులు క్లీనిక్‌పై దాడి చేసి, విచారిం చగా, నుజాత్ సుల్తానా యునానీ లో మెడిసిన్ పూర్తి చేసింది కానీ అల్లోపతి డాక్టర్‌గా ఎటువంటి లైసెన్స్, సర్టిఫికెట్, అర్హత లేకుండా గైనకాలజిస్ట్‌గా వైద్యం చేస్తోం దని తేలింది. డబ్బు కోసం పేషెంట్ల జీవితాలను ప్రమా దంలోకి నెట్టి, అక్రమంగా క్లీనిక్ నడుపుతున్న ఆమెను అరెస్ట్ చేసి, క్లీనిక్‌ను, క్లీనిక్ లో ఉన్న క్లీనికల్ ఐటమ్స్‌ను సీజ్ చేశామని, మరో డాక్టర్ గా చెలామణి అవుతున్న సైపుద్దీన్ పరారీలో ఉండటంతో అతని కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### ఆటోరిక్షాలకు పర్మిట్‌లు ఇవ్వడంతో హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 65 వేల ఆటోరిక్షాలకు సిఎం రేవంత్‌రెడ్డి పర్మిట్‌లు జారీ చేసి ఉత్తర్వులు విడుదల చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి హర్షం వ్యక్తం చేసింది. బుధవారం హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, నాయకులు అశోక్, జంగయ్య, వి.ప్రవీణ్, లింగం, వి.మారయ్య, మహేష్, శ్రీకాంత్, అజయ్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అనేక ఆందోళనలు చేసిన పిదప రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలలో భాగంగా కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు జారిరి అనుమతి ఇవ్వడం హర్షణీయమన్నారు. మిగతా ప్రధాన డిమాండ్లు 100 శాతం పెరిగిన ఇంధన చార్జీలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ప్రతి ఏడాది 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, ఆటో రవాణా రంగ సంక్షేమానికి ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### కోట నీలిమకు అభినందనల వెల్లువ



**బేగంపేట జూన్ 11, ప్రభాతవార్త :** టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమను సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు కోట నీలిమ నివాసంలో కల్సి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా త్రికాల మనోజ్‌కుమార్ కోట నీలిమను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలియజేసారు. కోట నీలిమను కల్సి అభినందనలు తెలియజేసిన వారిలో బచ్చు రాజ్‌కుమార్, హేమంత్ సింగ్ ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

## అండర్-15లో రవికుమార్ అద్భుత ప్రదర్శన

### -మాన్‌సూన్ రెగట్టా పోటీలు



పోటీల్లో గెలుపొందిన సెయిలర్ రవికుమార్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**
హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టాలో లోకల్ సెయిలర్ బన్నేవోలు రవి కుమార్ సత్తా చాటుతున్నాడు. అండర్ -15 ఆప్టిమిస్ట్ ఫ్లీట్‌లో తన స్థిరమైన ప్రదర్శనను కొనసాగిస్తూ బుధవారం జరిగిన రేసులో విజయం సాధించి పతకం సాధించే దిశగా దూసుకెళ్తున్నాడు. రసూల్‌పురాలోని ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న రవి రేసును అద్భుతంగా ప్రారంభించి ఆరో స్థానానికి పడిపోయినప్పటికీ నగరంలోని తారా హోమ్‌కు చెందిన అనాథ నవీన్. ఎంను అధిగమించాడు. అండర్ 15 విభాగం బాలికల్లో శ్రేయ కృష్ణ (తమిళనాడు) ఒక రేసులో 9వ స్థానానికి పడిపోయినప్పటికీ పుంజుకుని చివరి రేసులో గెలిచి గణనీయమైన తేడాతో అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ అమ్మాయి లాహిరి కొమరవెల్లి రెండో స్థానంలో ఉంది. అబ్బాయిల్లో తెలంగాణ కుర్రాడు రిజ్వాన్ మొహమ్మద్ స్వర్ణం దిశగా దూసుకెళ్తున్నాడు. అండర్ 19, 40 క్లాస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన తనుజశ్రావణ్, దీక్షిత గణేష్ జంటలు తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ, రజత పతకాలు దాదాపుగా ఖాయం చేసుకున్నారు. ఎన్ఎస్ఎస్ భోపాల్‌కు చెందిన సమృద్ధిపార్థ్ జంట కాంస్య పతకంపై పట్టు సాధించింది. అండర్ 15 విభాగం గ్రీన్ ఫ్లీట్‌లో హర్యానాకు చెందిన ఇద్దరు యువ సెయిలర్లు ఆయు, సాక్షి ఆధిపత్యం చెలాయి స్తూ పతకాలు సాధించే దిశగా పయనిస్తున్నారు. సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన ఇషి గుప్తా, తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్‌కు చెందిన సాక్షి మండల్ ఉన్నారు. అండర్ 18 లేజ ర్ క్లాస్‌లో నేవీ యూత్ సెయిలింగ్ టీమ్‌కు చెందిన శరణ్య జాదవ్, రమాకాంత్ ఫ్లీట్‌లో ఆధిక్యంలో ఉన్నారు.

## రెవెన్యూ అధికారులు పాతిన బోర్డులు తొలగించిన కబ్జాదారులు

### - కబ్జాదారులకే పరోక్ష మద్దతు ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది



మణికొండ సర్వే నెంబర్ 261.లోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు పాతిన బోర్డులు తీసి స్మశాన వాటికలో వేసిన కబ్జాదారులు

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** గండిపేట మండలం మణికొండ గ్రామ సర్వే నెంబర్ 261.లోని స్థలం ప్రభుత్వానికి చెందినదని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పేరుపై పాతిన బోర్డులను కబ్జాదారులు తొలగించారు. ఈ బోర్డులను తొలగించి స్మశాన వాటికలో ఓ మూలన పడేశారు. నిత్యం ఇదే ప్రాంతంలో తిరుగుతున్న రెవెన్యూ సిబ్బంది ఈ విషయంను చూసినా చూడనట్లు నటిస్తున్నారు. వీరు కబ్జాదారులతో చేతులు కలిపి పరోక్షంగా వారికే మద్దతు ఇస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న కబ్జాల విషయం గాని, కలెక్టర్ పేరుపై పాతిన బోర్డులు తొలగించిన విషయంను గాని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడం లేదు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకే ఉద్యోగంలో చేరిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఊదాసీనంగా వ్యవహరిస్తుండడం వలన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారుల వశం అవుతుంది. దీనికి ముమ్మాటికి రెవెన్యూ అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంది. 261.సర్వే నెంబర్‌లో 2006.సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పేదలకు 60.గజాల పట్టాలను 278.ఇచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం ఎవరికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. కానీ స్థానికంగా ఉన్న కొంత మంది రాజకీయ నాయకులు తమ అనుచరగణంతో డూప్లికేట్ 60.గజాల పట్టాలు తయారు చేయించి, కబ్జాలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఇక్కడ 500. వరకు ఇళ్లు కట్టారు. ఇంత భారీ ఎత్తున దొంగ పట్టాలు తయారు చేసి, కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని మాయం చేస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుండడం గమనార్హం. కబ్జాదారులు ఇచ్చే కాసులకు రెవెన్యూ యంత్రాంగం కక్కుర్తి పడడం వల్లనే ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు దర్జాగా కబ్జాలు చేసేస్తున్నారని, ఇళ్లు కట్టేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. మణికొండలో ప్రభుత్వ భూమి కరిగిపోతుండడంను గమనిస్తుంటే "కంచే చేను మేసిన చందంగా" మారిందని వయోజనులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రభుత్వ భూమిని కాపాడడం వారి ఉద్యోగం, కానీ ఆ పనిని మొక్కబడిగా చేస్తూ, పక్క నుంచి వచ్చే అక్రమ సంపాదనకు ఇక్కడి రెవెన్యూ యంత్రాంగం అలవాటు పడ్డారని, అందుకే సర్వే నెంబర్ 261.లో ఇంత దర్జాగా కబ్జాదారులు సర్కారు భూమిని స్వాహా చేసేస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మణికొండలో జరుగుతున్న కబ్జాల తతంగంపై స్పందించాలని, విధుల పట్ల ఊదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని మణికొండ గ్రామస్థులు కోరుతున్నారు.

**తహసీల్దార్ వివరణ :**
మణికొండ సర్వే నెంబర్ 261.లో ప్రభుత్వ భూమి అని పెట్టిన బోర్డులను తొలగించిన విషయంను ప్రభాతవార్త గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ బోర్డులు తొలగించిన వారిని గుర్తించి, క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### మంత్రివర్గంలో వివేక్ వెంకటస్వామికి చోటు లభించడం హర్షణీయం : చిరంజీవి



మంత్రివర్గంలో స్థానంపొందిన వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న వల్లభనేని ప్రసాద్, టి.చిరంజీవి, వి.భారతి తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి స్థానం కల్పించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఫర్ డీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని ప్రసాద్, అడ్మిన్ ఇంటర్‌ప్రిటర్ వి.భారతి, డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ వెల్లడించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వివేక్‌వెంకటస్వామిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పదిహేను నెలలుగా ఎదురుచూస్తున్న తమ కళ చివరకు సాకారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ వర్గాలకు వివేక్‌వెంకటస్వామి నాయకత్వంలో న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

### సమాజాన్ని ప్రతిబింబించే నాటకాలను బతికించుకోవాలి
#### -ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం



కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:**
సమాజాన్ని ప్రతిబింబించే నాటకాలను బతికించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సింధు కళాసంధ్య సాంస్కృతిక సేవా నిలయం అధినేత, ప్రముఖ గాయకుడు రవి ఆధ్వర్యంలో 'కళాకదంబం' కార్యక్రమంలో భాగంగా 'ప్రేమ రుతువు నాటిక' ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు శ్రోతలను అలరించింది. నిర్వాహకుడు, గాయకుడు రవి నటులు రవి వర్మ వేక్షణలో తొలుత తెలుగు హిందీ సినీసంగీత విభావరి, అనంతరం నాటక ప్రదర్శన, చివరగా స్వల్ప విడివిలో శాస్త్రీయ నృత్యరూపక ప్రదర్శన ఆకట్టుకునేలా జరిగాయి. ఈ కార్యక్రమంలో సత్కళాభారతి అధినేత సత్యనారాయణ, కార్యక్రమంలో సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హను మంతరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సంగనభట్ల నరసయ్య, జరుగుల రామారావు, మాదవి, పూజిత, కార్తీక్, జశ్వంత్‌రాణా, బుర్రా మోహనకృష్ణ శివరమ్య, పద్మావతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. లాస్య కూచిపూడి స్కూల్ ఆధ్వర్యంలో రోహిణి ప్రసాద్ బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రోహిణి ప్రసాద్ 'వెంకటేశ్వర వైభవం-శ్రీ మార్కండేయ చరిత్ర' అంశంపై నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది.


### కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే తలసాని



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ పండితులు

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:**
బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను జరుపుతున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఎల్లమ్మ ఆలయ అధికారులు వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి జులై 1 వ తేదీన అమ్మవారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేస్తూ లేఖను అందజేశారు. ముందుగా ఆలయ పండితులు ఎమ్మెల్యేను వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించే అమ్మవారి కళ్యాణాన్ని తిలకించేందుకు నగరం నుండే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి కూడా పెద్ద సంఖ్యలో వస్తారని గుర్తు చేశారు. ఈ సంవత్స రం కూడా అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 14వ తేదీన ఉదయం 10.00 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, నివీ కృష్ణ తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 11 ప్రభాతవార్త:**
ప్రజా ఆకాంక్ష మేరకు అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళుతున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాయల్ ఎన్‌క్లేవ్‌లో 49లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలో 90శాతం డ్రైనేజీ పనులను పూర్తి చేశామని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. సిసి రోడ్డు ఏర్పాటు ద్వారా రాక పోకలకు ఇకపై ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, దిడ్ల స్వామి, నవీన్, కొండల్ రెడ్డి, విష్ణు, వెంకటేష్ గౌడ్, దేవ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఒక గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని దోమలగూడ పెట్రోలింగ్ పోలీసులు ఫుట్‌పాత్‌పై గుర్తించారు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల ఎనిమిదవ తేదీ రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్ క్రింద, అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఆ వ్యక్తి గురించి అక్కడ స్థానికులను విచారించగా ఆ వ్యక్తి ఎవరో తెలియదని, అక్కడే భిక్షాటన చేస్తూ ఉండేవాడని తెలియటంతో మృతదేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించి, మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## మండలంలో ఘనంగా ఏరువాక

సదాశివపేట, జూన్ 11, ప్రభాతవార్త:
ఏరువాక పౌర్ణమిని బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పశువులను అందంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహిం చారు. రైతులు ఒకరికిఒకరు ఏరువాకపౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## కొండాపూర్‌లో ఘనంగా ఏరువాక పౌర్ణమి

కొండాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:
మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం నాడు ఏరువాక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. ఇది రైతులకు ప్రధానపండుగ అని రైతులు తెలిపారు. వర్షకాలానికి సూచిక ఏరువాక అన్నారు.జేష్ఠ మాస పౌర్ణమి మే చివర లేదా జూన్ ప్రారంభంలో జరుపుకుంటారు. ఈపండుగ తో రైతులు పంటపొలాల్లో పంటలు వేయడానికి సిద్ధమవుతారు.మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో రైతులు తమ పశువులను శుభ్రంగా కడిగి పూజలు నిర్వహించారు. ఆయాగ్రామాలలో సామూహికంగా ఆటలు, పాటలతో ఎడ్లబండ్లను ఊరేగించారు. అనంతరం రైతులు, గ్రామస్థులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## తిమ్మాపూర్‌లో అమ్మమాట అంగన్‌వాడి బాట

మనూర్, జూన్ 11, ప్రభాతవార్త:
మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో బుధవారం అంగన్‌వాడి టీచర్ల ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు మాట్లాడుతూ 0-5 మధ్య వయసు గల చిన్నారులకు అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని వినతి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సబిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధి హామీపై ప్రజావేదిక

సిర్గాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:
ఈ నెల 12వ తారీఖున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో చేపట్టిన పనులపై ప్రజా దర్బార్ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి పేర్కొన్నారు. 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామి పనులపై జూన్ 1వ తారీఖు నుంచి 11వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి నివేదికలను రూపొందించారు. గ్రామాల్లో రూపొందించిన నివేదికలను మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ఉదయం 10.30 గంటలకు రైతు వేదికలో నిర్వహించే ప్రజా దర్బార్ ప్రజా వేదికలో సమర్పిస్తారని ఎంపిడిఓ, ఏపిఓలు వివరించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపోల్, జూన్ 11, ప్రభాతవార్త:
రాయపోల్ మండల పరిధిలోని గ్రామాలలో గురువారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రాయపోల్ విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు.మండల పరిధిలోని పలు సబ్‌స్టేషన్లలో మరమత్తు పనులు అలాగే 33 కెవి లైన్ల కింద ఉన్న చెట్ల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.ఆయా గ్రామాల ప్రజలు,రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## సిఐగా పదోన్నతి పొందిన వెంకట్‌రెడ్డికి సన్మానం



ఎస్ఐ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

సిర్గాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:
సిఐగా పదోన్నతి అందుకున్న సిర్గాపూర్ పోలీసు ఠాణా ఎస్ఐ వెంకట్‌రెడ్డిని బుధవారం గ్రామ యూత్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో యూత్ సభ్యులు నర్సాగౌడ్, రమేష్, ప్రేమ్, అంబాదాస్, సురేష్, చింటూ, సాయికుమార్, రాముడు, నాయక్ తదితరులు ఉన్నారు.

## మనూర్‌లో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

మనూర్, జూన్ 11, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకుని రైతులు వేతుకలను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాగుకున్న పశువులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో చుట్టూ ఎడ్లను, అవులను, అందంగా అలంకరించిన ట్రాక్టర్లను భాజా భజంత్రీలు వాయిస్తూ ప్రదక్షిణలు చేయించారు.

## మహాసభల ఆహ్వానసంఘం సభ ప్రత్యేక సమావేశాన్ని విజయవంతం చేయాలి

-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్



మాట్లాడుతున్న గడిపె మల్లేష్

హుస్నాబాద్ టౌన్, జూన్ 11, ప్రభాతవార్త:
ఈనెల 27వ తేదీన జరిగే సిపిఐ పార్టీ జిల్లా మహాసభల ప్రత్యేక సమావేశాన్ని ఈనెల 12వ తేదీన ఏర్పాటు చేశామని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 5వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిపిఐ పార్టీకి సంబంధించిన జిల్లా మహాసభల ఆహ్వానసంఘం సభ ప్రత్యేకసమావేశాన్ని 12న నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని ఈసమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు హాజరవుతున్నారని కావున ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, ఎల్లయ్య, భాగ్యలక్ష్మి, శబాన, వసంత, రాణి, కనుకవ్వలు ఉన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

ఝరాసంగం, జూన్ 11, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన ఝరాసంగంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా జరుపుకున్నారు. తాము సాకుతున్న పశువులను (ఆవులు, ఎద్దులు, లేగదూడలు) అందంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయాగ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

## ఘనంగా ఏరువాక పూర్ణమి సంబరాలు

న్యాల్‌కల్, జూన్ 11, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. అలంకరించిన పశువులను గ్రామాల్లోని ఆంజనేయస్వామ ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేయించారు. మల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీపతి శివానంద్, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ బడక రాఉ, బిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షులు సిద్దారెడ్డి, యువ నాయకులు మారుతి, విటల్, పంఇత్ బసవరాజ్, ప్రతాపరెడ్డి, జైపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, శాంతు, దనరాజ్, జలంధర్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

-రాయపోల్ ఎస్ఐ రఘుపతి



మాట్లాడుతున్న రాయపోల్ ఎస్ఐ రఘుపతి

రాయపోల్, జూన్ 11, ప్రభాతవార్త:
బెట్టింగ్‌ల జోలికివెళ్లి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రాయపోల్ ఎస్ఐ రఘుపతి పిలుపునిచ్చారు.రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా రాయపోల్ ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ..యుక్త వయసులో ఉన్న యువతి,యువకులను తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు విధిగా నిబంధనలు పాటించాలని,తప్పని సరిగ్గా ఎక్కడికివెళ్లినా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఆశ,భయం,మానవ తప్పిదం వల్లనే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని,వ్యక్తిగత సమాచారం ఇతరులకు తెలియజేవద్దని కోరారు.ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు,వ్యాపారస్తులు,ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.సీసీ కెమెరాలు ఉన్న గ్రామాలలో దొంగతనం చేయాలంటే భయపడుతారని తెలిపారు.అలాగే మూఢనమ్మకాలు,చేతబడులను నమ్మవద్దని,మూడనమ్మకాలు నమ్మి ఒకరిపైఒకరు దాడులుచేసుకోవద్దని ప్రజలకు సూచించారు. మూఢ నమ్మకాలు, చేతబడులు,రోడ్డు ప్రమాదాలు,గంజాయి ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు,సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట కళాబృందం సభ్యులు బాలు,రాజు,తిరుమల,తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు రవి,రవీందర్,నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని చూస్తేనే బిఆర్ఎస్ భయపడుతుంది

-పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు



విలేకరులతో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

సిద్దిపేట రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:
సిఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే ముందు కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) హెచ్చరించారు. సిద్దిపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సిఎం కెసిఆర్ హాజరు అవుతున్న సందర్భంలో కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బిఆర్ఎస్ 10 యేండ్ల కాలంలో జరిగిన అవినీతి అక్రమాలను బయటకు తీస్తుంటే కెటిఆర్, బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటీవరకు సిఎం రేవంత్‌రెడ్డిని చూస్తేనే బిఆర్ఎస్ నాయకులు భయపడుతున్నారని తెలిపారు. కెటిఆర్ స్థాయినిమించి చిల్లర నాయకునిలాగా వ్యవహారించడం సరికాదన్నారు. అవినీతి చేసి పైగా దబాయించి మాట్లాడడం ఎమిటని ప్రశ్నించారు. మరోసారి సిఎంతో పాటు ప్రభుత్వం,నాయకులపై విమర్శలు, ఆరోపణలు చేస్తే చూస్తూ ఉరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు.సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, సలీం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట .. మన అంగన్‌వాడీ బాట

హుస్నాబాద్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:
ప్రతీ అమ్మ మాట .. మన అంగన్‌వాడి బాట అని అంగన్‌వాడి టీచర్ జి తిరుమల అన్నారు. బుధవారం రోజున పట్టణంలోని ఎల్లమ్మ బజార్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ హుస్నాబాద్ ఆధ్వర్యంలో సిడిపివో జయశ్రీ ఆదేశాల మేరకు హ్యాపీ ప్లే స్కూల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తమ పాఠశాల పరిధిలోని విద్యార్థులను అంగన్ వాడి కేంద్రాలకు పంపించాలని కోరుతూ తల్లితండ్రులతో పాటు గర్భిణీ స్త్రీలు, బాలింతలు సైతం పాఠశాలలకు వచ్చి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వారికి కుంకుమ బొట్టు పెడుతూ ఆహ్వానించారు.

## సెంట్రల్ జైలును సదర్శించిన జనరల్ డైరెక్టర్

సంగారెడ్డి టైన్/కంది, జూన్ 11, ప్రభాతవార్త:
జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పురాతన జైలు, మండల కేంద్రమైన కందిలోని సెంట్రల్ జైలులను రాష్ట్ర జైళ్ల, సంస్కరణల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సమ్య మిశ్రా బుధవారం సందర్శించారు. జైలులో ఖైదీలకు అందుతున్న వసతులను, వారికి అందించే ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలు నందు పిపిపిలో నెలకొల్పబడుతున్న ఫర్నిచర్, పరిశ్రమ పనులను వేగవంతం చేయాలని ఆదేశించడంతో పాటు జలు నందు ఏర్పాటుకాబోతున్న డిఎడిక్షన్ సెంటర్‌ను గురంచి సూచనలు చేశారు. జౌళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల అమలును పరిశీలించారు. కార్యక్రమంలో ఐజి ఎన్ మురళీబాబు, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి సంతోష్ కుమార్ రాయ్, డిప్యూటీ సూపరింటిడెంట్ డి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చిన్నశంకరంపేట, జూన్ 11, ప్రభాతవార్త:
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి మండల విద్యాధికారి పుష్పవేణి అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పారిశుద్ధ కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేటి నుండి పాఠశాలల ప్రారంభం కానున్న నేపథ్యంలో పారిశుద్ధ కార్మికులు పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వంటశాలలను, పాత్రలను ఉంచి రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. వంటను వండే సమయంలో జాగ్రత్తలను పాటించాలన్నారు. మరుగుదొడ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల పరిసరాలను కూడ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బడీడు పిల్లల్ని గుర్తించి వారి తల్లితండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేల చూడాలన్నారు. అనంతరం వంటగది సిబ్బందికి దుస్తులను అందించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మండలవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో వనమహోత్సవం



ఫోటో-2 సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో దామోదర్

చిన్నశంకరంపేట, జూన్ 11, ప్రభాతవార్త:
మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వన మహోత్సవానికి సిద్దంగా ఉండాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. బుధవారం నాడు చిన్నశంకరంపేట పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామిలో వ్యవసాయ ఆధారిత పనులు మాత్రమే చేయాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపివో రాజ్ కుమార్, సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫిల్డ్ అసిస్టెంట్లు, టీఏలు పాల్గోన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

-కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ

సిద్దిపేట రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:
సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి రూ.2 కోట్ల 60 లక్షల నిధులు మంజూరు వచ్చినట్లు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక కృషితో నియోజకవర్గాన్ని నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 9 కొత్త గ్రామ పంచాయతీలకు కోటి 80 లక్షలు, 10 కొత్త అంగన్‌వాడీల కోసం రూ.80 లక్షలు చొప్పున మంజూరు వచ్చినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కలీం, యాదగిరి, లక్ష్మి, వహీద్‌ఖాన్, షాబుద్దీన్, వాహబ్, గయాజుద్దీన్, వెంకట్‌రెడ్డి, సాంబమూర్తి,జనార్దన్‌రెడ్డి, అజ్మాత్, ప్రవీణ్, కవిత, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను అభాసుపాలు చేసేందుకే నోటీసులు

-బిఆర్ఎస్ నాయకులు మర్కంటి కనకయ్య, కళ్యాణ్‌కార్ నర్సింగరావు



హైద్రాబాద్‌కు తరలివెళ్తున్న బిఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, జూన్ 11, ప్రభాతవార్త:
పిసి ఘోష్ కమిషన్ కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వగా బుధవారం బిఆర్‌కె భవన్‌కు విచారణ నిమిత్తం వెళ్ళిన కెసిఆర్‌కు మద్దతుగా గజ్వేల్ నియోజకవర్గంనుండి భారీగా బిఆర్ఎస్‌నాయకులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. కెసిఆర్ కుటుంబాన్ని వేధించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగకున్నా అక్కసుతో కెసిఆర్, హరీష్‌రావులకు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అబాసుపాలు చేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. బిఆర్‌కె భవన్‌కు తరలివెళ్ళిన ఎన్‌సి.సంతోష్ యువసేన పిసి ఘోష్ కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరవుతున్న సందర్భంగా గజ్వేల్ నుండి సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు ఎన్‌సి.సంతోష్, రాష్ట్ర యువజన నాయకుడు జుబేర్‌పాషాతో పాటు ఎన్‌సి.సంతోష్ యువసేన పెద్దఎత్తున తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో నాచారం మాజీ డైరెక్టర్ మామిడి నరేష్‌గౌడ్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ఎల్ల వెంకటేష్, బిఆర్ఎస్ 3వ వార్డు అధ్యక్షుడు మల్లేశం, కళ్యాణ్‌కార్ శ్రీనివాస్, కాటు కళ్యాణ్, నజీర్ తదితరులు ఉన్నారు.

## విధులు నిర్వర్తించలేము

-పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

చిన్నశంకరంపేట,జూన్ 11,ప్రభాతవార్త:
తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నామని, పంచాయతీ నిర్వహణకు చేతితో చిల్లి గవ్వకూడ లేదని, పాలన ఎలా కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం వారు చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థికపరమైన విధులను ఇకనుండి నిర్వహించ లేమన్నారు. పంచాయతీలకు కేటాయించిన పారిశుద్ద సేకరణ ట్రాక్టర్‌లకు డీజిల్, మరమ్మత్తులు వంటి పనులకు సొంతడబ్బులతో నిర్వహించామన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నాటి నుండి నేటి వరకు గ్రామాల్లో ఆర్థిక పరమైన విధులకు డబ్బులు ఖర్చు చేసినప్పటికి నిధులు మాత్రం విడుదల కాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల విడుదలయ్యే వరకు నేటి నుండి ట్రాక్టర్‌ల చేత్త సేకరణకు నడిపేది లేదని తెలిపారు. అనంతరం ఎంపీడీవో దామోదర్‌కు వినతి పత్రం అందించారు,

## నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలను పరిశీలిస్తున్న గృహనిర్మాణ పిడి మాణిక్యం

చిన్నశంకరంపేట,జూన్ 11,ప్రభాతవార్త:
సరైన నివాసం లేనటువంటి అర్హులైన నిరుపేద ప్రజలకు నిర్మించేటువంటి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ మాణిక్యం అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధి మిర్జాపల్లి తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని తెలిపారు. అధికారులు నిత్యం నిర్మాణాలను పర్యవేక్షిస్తూ ఇంటికి అయ్యే ఖర్చులు వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో దామోదర్, ఏఈ లోకేష్‌లు ఉన్నారు.

## ఎస్ఐని సన్మానించిన దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:
జహీరాబాద్ పట్టణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌కుమార్‌ను బుధవారం దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిక్కీ మెదక్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్ జనార్ధన్, అంబేద్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు మొగులయ్య గౌతమ్, అధ్యక్షులు డి శ్రీనివాస్, బి కృష్ణ, కవి గాయాకులు రామ్‌చందర్ భీంవంశీ, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి కన్వీనర్ బి.నర్సయ్య పాల్గొన్నారు.

## అభిమాన జర్నలిస్టుతో అక్షరాభ్యాసం



చిన్నారితో అక్షరాలను దిదిస్తున్న విరాహత్‌అలీ

గజ్వేల్, జూన్ 11, ప్రభాతవార్త:
చదువులో తమ పిల్లలు రాణించాలనే మొక్కుబడితో ఆలయాల్లో వేద పండితుల చేతులమీదుగా తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయిస్తుండడం చూస్తుంటాం. కానీ దశాబ్దాలుగా తమ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచిన టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్‌అలీ చేతులమీదుగా ప్రజ్ఞాపూర్‌కు చెందిన సోముకుమార్ తనకూతురు హరిచరణకు అక్షరాభ్యాసం చేయించారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని టియూడబ్ల్యూజే కార్యాలయానికి చేరుకొని విరాహత్‌అలీ చేతులమీదుగా చిన్నారు హరిచరణకు అక్షరాభ్యాసం చేయించుకొని ఆయన ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

వర్గల్, జూన్ 11, ప్రభాతవార్త:
వర్గల్ మండలంలోని అవుసులోనిపల్లి, నగరంతండా, చౌదరిపల్లి, సీతారాంపల్లి గ్రామాల్లో బుధవారం మండల వనయవసాయాధికారి శేషశయన ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎండి.లతీఫ్‌పాషా మాట్లాడుతూ రైతులు పండించే పంటలు మొక్కజొన్న, వరిలో చీడపీడల నివారణ చర్యలు, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, సాగునీటి పొదుపు ఆవశ్యకతను వివరించారు. డాక్టర్ ఎం.పల్లవి మాట్లాడుతూ పంట మార్పిడి, విత్తనశుద్ధిలో మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సునీత, పంచాయతీ కార్యదర్శి గీత, భావన, రైతులు మల్లేష్, పాండు, లాలు పాల్గొన్నారు.

## ప్రపంచశాంతి, దేశక్షేమం కోసం క్రైస్తవుల ఉపావాస దీక్ష

హుస్నాబాద్ టౌన్, జూన్ 11, ప్రభాతవార్త:
ప్రపంచశాంతి, భారతదేశ క్షేమం కోసం పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో క్రైస్తవులు బుదవారం 12గంటల ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పాస్టర్‌ల అసోసియోషన్ అధ్యక్షులు సోలమాన్ రాజ్ మాట్లాడుతూ ప్రపంచశాంతి, దేశక్షేమంతో పాటు పలు సమస్యలపై చర్చించడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు వివరించారు. ఈ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా పడి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని వేడుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు వల్లపు రాజు, సత్యానందం, పాండుతో పాటు పాస్టర్‌లు బెన్ని, ప్రకాష్‌రెడ్డి,ఇస్సాక్, మోసెస్, సామిల్ రెడ్డి,డేవిడ్, ఇజ్రాయేల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సదాశివపేట, జూన్ 11, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఆత్మకూరులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని ఆత్మకూరులో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ సరస్వతికి పేదలతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 170లో పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి 15 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి పోజీషన్ చూపడంలో అధికారులు విఫలం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాల పొజిషన్ చూపించాలని సూచించారు.

**అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం-తహసీల్దార్...**

ఆత్మకూరు గ్రామంలో అర్హులైన పేదలందరికి విచారణ నిర్వహించి ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని తహసీల్దార్ సరస్వతి పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భూషణం, ఎన్ మహేష్, ఆర్ పుష్పమ్మ, చంద్రయ్య, సాయిబాబు తదతరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

న్యాల్‌కల్, జూన్ 11, ప్రభాతవార్త:
2025-26 ఆర్థిక సంవత్సరం (ఖరీఫ్) సీజన్‌కు గాను రైతులు రైతు భరోసా కోసం ధరఖాస్తులు చేసుకోవాలని న్యాల్‌కల్ ఏఈఓ ఈనా రాథోడ్ తెలిపారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో రైతులు తమ ధరఖాస్తులను అందచేయాలని సూచించారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్సు పత్రాలతో కూడిని ధరఖాస్తును అందచేయాలని ఈనా రాథోడ్ వివరించారు.

## పిల్లలకు పోషకాహారం అందించేందుకే ఎగ్ బిర్యాని..

-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి..

నర్సాపూర్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:
అంగన్వాడి పిల్లలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంలో భాగంగా ప్రతి బుధవారం అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ వండి పెట్టే పథకం ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వ నూతనంగా ప్రారంభించిన అంగన్వాడి కేంద్రాల్లో ఎగ్ బిర్యాని పథకాన్ని ప్రారంభించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ హేమా భార్గవి, మధులత సూపర్వైజర్లు సరళమ్మ, అంగన్వాడి టీచర్‌చ పిల్లలు, తల్లులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలు

వర్గల్, జూన్ 11 (ప్రభాతవార్త):
మండలకేంద్రమైన వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం విద్యార్థి ప్రతినిధుల ఎంపికకు గానూ ఎన్నికలు నిర్వహించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికలు స్కూల్ కెప్టెన్, అసోసియేషన్ కెప్టెన్, మెస్ కెప్టెన్, అసోసియేట్ మెస్ కెప్టెన్, సిసిఏ కెప్టెన్, అసోసియేట్ సిసిఏ కెప్టెన్, గేమ్స్ కెప్టెన్, అసోసియేట్ గేమ్స్ కెప్టెన్ పదవులకు జరిగినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 242 మంది బాలురు, 179 మంది బాలికలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమై 8 గంటల వరకు కొనసాగగా ఫలితాలను గురువారం ఉదయం వెల్లడించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యాలయంలో మొదటిసారి నిర్వహించిన ఈ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా కొనసాగిందన్నారు.

## కొత్త వ్యక్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి



ఉపాధి కూలీలకు చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొండపాక, జూన్ 11, ప్రభాతవార్త:
మహిళలకు ఏ రకమైన ఇబ్బందులు ఎదురైన మౌనం వీడి పోలీసులకు తెలియజేయాలని సిద్దిపేట షీ టీమ్ బృందం ఎఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్స్ రజిని, మమత, లక్ష్మినారాయణ, ప్రవీణ్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మర్పడ్గలో ఉపాధి హామీ కూలీలకు మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల మాటలు నమ్మవద్దని, గుర్తుతెలియన వ్యక్తులు చెప్పిన విషయాలు నమ్మవద్దన్నారు. ర్యాగింగ్, ఈవ్ టిజంగ్, ఫోక్సో, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, నూతన చట్టాల గురించి వివరించారు. గంజాయి, మత్తు పదర్థాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ ఫోన్‌కు బానిసలు కాకుండా చూసుకోవాలని, సెల్ ఫోన్‌వల్ల ఎంత లాభం ఉందో అంత నష్టం కూడా ఉందన్నారు.

## శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలు

నర్సాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:
నర్సాపూర్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం మహిళలు ఎంతో వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాక లలిత సహస్ర పారాయణం చేశారు. నూతన శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ట అనంతరం మొట్టమొదటిసారిగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన లో ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శి జొన్నవాడ మల్లేశం గుప్తా, కోశాధికారి ప్రొద్దుటూరు హరీష్ గుప్తా, ఉపాధ్యక్షులు సోలేటి చంద్రశేఖర్ గుప్తా, మిరియాల చంద్రశేఖర్ గుప్తా, రాములు గుప్తా, శ్రీనివాస్ గుప్తా, నోముల పాండురంగం గుప్తా, ప్రవీణ్ గుప్తా, నాగేష్ గుప్తా, సుధాకర్ గుప్తా, ఆర్యవైశ్య ప్రముఖులందరూ పాల్గొన్నారు.

## జాతర ఉత్సవాలలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి



ఉత్సవాలలో పాల్గొన్న రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

హత్నూర, జూన్ 11, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన హత్నూరలోని సుందరమ్మ దేవాలయంలో బుధవారం జరిగిన ఉత్సవాలలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిపాల్గొని ప్రత్యేకపూజలుచేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మండలకాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి

**మునిపల్లి, జూన్ 11, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలంలో ఏరువాకపౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ కాడెడ్లను అందంగా అలంకరించి పూజించారు. బుధేరా, మునిపల్లి, ఖమ్మంపల్లి, మలికలకార్జునపల్లి, చిన్నచెల్మెడ, ఫైద్లాపూర్, అల్లాపూర్, తక్కెడపల్లి, బోడపల్లి, గోప్లారం, అంతారం. గోర్రెగట్టు, కంకోల్, లింగంపల్లి, మేళాసంగెం, మగ్దుంపల్లి, పెద్దచెల్మెడ, మన్‌సాన్పల్లి, తాటిపల్లి, లోనికలాన్, చీలపల్లి, మక్తక్యాసారం, కల్లపల్లి బేలూర్, బోడిశెట్టిపల్లి గ్రామాలలో నందిగా భావిస్తూ ఎద్దులను అలంకరించి తినుబండారాలను తినిపించి ఆయాగ్రామాల్లో గల శివాలయాలు, ఇతర ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఆనందంగా పండుగను జరుపుకున్నారు.

## పేటలో ఘనంగా ఏరువాక


ఎడ్లను పూజిస్తున్న మంజీర రైతుసమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్

**సదాశివపేట, జూన్ 11, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలంలో ఏరువాకపౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సదాశివపేటలోని పాతకేరిలో మంజీర రైతుసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ వ్యవసాయపు ఎద్దులను అలంకరించి పిండివంటలను తినిపించి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని వారు కోరుకన్నట్టు తెలిపారు. ఆయన వెంట రైతులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాషాపటేల్, కుమార్, రాజు, శ్రీశైలం, నందులున్నారు.

## కోలంపేట్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**కంది, జూన్ 11, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కోలంపేట్‌లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జోగిపేటలోని వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్పందన, మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్‌గౌడ్‌లు రైతులు ఎరువుల దుకాణంలో కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాల రశీదులు పంట చేతికి అందేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. సాగునీటిని వృధాచేయకుండా ఆదాచేసుకోవాలని, భావితరాలకు నీటిని అందించాలన్నారు. పంట మర్పిఇ పాటించి అధిక దిగుబడులు సాధించి సుస్థిర ఆదాయం అందుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కిషన్, సంగారెడ్డి బిటిఎం బీనా, రైతులు పాల్గొన్నారు.

## బడికి వేళాయే...టెన్షన్ మొదలాయే..

**సదాశివపేట, జూన్ 11, ప్రభాతవార్త:**
నెలరోజులుగా మూతపడిన బడులు నేడు తెరుచుకోనున్నాయి. వేసవి సెలవు కోసం వేచి చూసిన పిల్లలకు సెలవులు అప్పుడే ముగిశాయా అన్పిస్తున్నాయి. విద్యార్థులు సెలవుల కాలంలో విహార యాత్రలకు, ఇతరత్రా ప్రదేశాలకు వెళ్లి సరదాగా గడిపారు. సరదాగా గడిచిన 45 రోజులు అపుడే పూర్తయ్యాయా అని వారిలో టెన్షన్ మొదలైంది. ఇక బ్యాగుల నిండా పుస్తకాలు మోసుకుని స్కూలుకు వెళ్లాలా అని వారిలో ఆందోళన మొదలైంది. కొన్ని రోజులు గడిస్తేగాని వారు మళ్లీ చదువుపై దృష్టి సారించలేరు. ఉపాధ్యాయులు పిల్లలకు సెల్‌ఫోన్లపై దృష్టి పోనివ్వకుండా తగుసూచనలు ఇవ్వాలని మేధావులు కోరుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ చూపి వారిని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలని అంటున్నారు. పిల్లలను దారిలో పెట్టడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరుతున్నారు.

## పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి


మాట్లాడుతున్న బహుజన సేన రాష్ట్రకమిటీ సభ్యులు డప్పు రాజు

**కొండాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:**
పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బహుజన సేన రాష్ట్ర కమిటీ సభ్యుడు డప్పు రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు బస్సులు సరిపోను నడపాలని విధ్యార్థులు ఆందోళన చేపడ్తూ వుంటే ఆర్టీసీ యాజమాన్యం బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అని చెబుతూ విధ్యార్థుల బస్‌పాస్‌లు పెంచడం శోచనీయమన్నారు. మండలంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, బస్సు సర్వీసులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. నెలకు రూ. 400 వున్న బస్‌పాస్ ధర రూ.600లకు పెంచడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వం పెంచిన బస్‌పాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేని యెడల బహుజన సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అందోళన చేపడ్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు నగేష్, సంజీవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీమ్జ్ ఏరియాను పరిశీలించిన సంజయ్‌కుమార్


నీమ్జ్ ఏరియాను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్‌కార్యదర్శి సంజయ్‌కుమార్

**ఝరాసంగం, జూన్ 11, ప్రభాతవార్త:**
మండలంలోని ఎల్గోయి, బర్దీపూర్ గ్రామాల శివారులోని నీమ్జ్ ఏరియాను రాష్ట్ర ప్రత్యేక ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నీమ్జ్ కోసం ఇప్పటివరకు సేకరించిన భూముల వివరాలను, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను నీమ్జ్ అధికారులను సంజయ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. హుండాయి కంపెనీకి కేటాయించిన భూమిని, భూమి వాతావరణాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. కార్యక్రమంలో నీమ్జ్ అదనపు కలెక్టర్ రాజు, జహీరాబాద్ ఆర్‌డిఓ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూభారతితో భూసమస్యలకు పరిష్కారం



రెవిన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తునన ఆర్ఐ హనుమంత్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, జూన్ 11, ప్రభాతవార్త:**
భూభారతి చట్టంతో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్ఐ హనుమంత్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని కారముంగి గ్రామంలో నిర్వహించిన రెవిన్యూసదస్సులో రైతులు అందచేసిన దరఖాస్తులను స్వీకరించి రైతులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఇంద్రకుమార్, జూనియర్ అసిస్టెంట్ సునీత, నరసింహులు, విఆర్ఏ రమేష్, బసవరాజ్, రైతులు పాల్గొన్నారు.

# ముదిరాజుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### -శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి


అమీన్‌పూర్‌లో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**అమీన్‌పూర్, జూన్ 8, ప్రభాతవార్త:**
నియోజకవర్గ పరిధిలోని ముదిరాజుల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య రోడ్డులో నూతనంగా నిర్మించ తలపెట్టిన ముదిరాజ్ భవనం పనులకు ఆయన ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సేవాదృక్పథం, ధైర్యానికి మారుపేరైన ముదిరాజులు తెలంగాణ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ముదిరాజుల కోసం సొంత నిధులచే సంక్షేమసంఘ భవనాలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్‌ను రెండు కోట్ల రూపాయల సొంత నిధులతో ఆధునీకరించడం జరిగిందని గుర్తు చేశారు. అమీన్‌పూర్‌లో నిర్మిస్తున్న ముదిరాజ్ భవన్ నిర్మాణానికి సైతం త్వరలోనే నిధులు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమపథకాలలోనూ ముదిరాజులకు తగు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గము నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో ముదిరాజులు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దేవానందం, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, మాజీకౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కొల్లూరి మల్లేష్, బాలరాజు, ఉపేందర్, కృష్ణ, బిజిలీ రాజు, చదువుల మల్లేష్, రాములు, బాశెట్టి అశోక్, రాజేష్, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ బిజెపికి బద్ద వ్యతిరేక పార్టీలు

### -వ్యవసాయ రంగంలో భారత్ ఇజ్రాయిల్, జర్మనీతో పోటీ పడుతుంది


విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో 10 యేండ్లు అధికారంలో ఉన్న కుటుంబ పార్టీ(బిఆర్ఎస్), ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బిజెపికి బద్ద వ్యతిరేక పార్టీలని ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.వెంకటరెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్ర కౌన్సిల్‌లో ఒక సభ్యుడు మాత్రమే ఉండేవారని ప్రస్తుతం ముగ్గురికి చేరుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతుందన్నారు. కేంద్రంలో బిజెపి సర్కారు మోడీ నేతృత్వంలో విజయవంతంగా 11యేండ్లు పూర్తి చేసుకుందన్నారు. బిజెపి అధికారంలోకి రాక ముందు అన్ని శాఖలలో స్కాంలు అవినీతి జరిగిందన్నారు. ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశ ఆర్థిక పరిస్థితి 12వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందన్నారు. కేంద్ర సర్కారు రైతులకు సబ్సీడిపై ఎరువులను అందిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో భారత్ ఇజ్రాయిల్, జర్మనీతో పోటీ పడుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతులకు రైతుబంధు సరైన సమయంలో ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేశ రక్షణరంగాన్ని చూసి ప్రపంచం నివ్వెరపోతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, బాసంగారి వెంకట్, వెంకటేశం ఉన్నారు.

## భూభారతితో పెండింగ్ సమస్యలకు పరిష్కారం

### -రెవిన్యూ సదస్సులో ఆర్‌డిఓ పాండు


రెవిన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్‌డిఓ పాండు

**చౌటకూరు, జూన్ 11, ప్రభాతవార్త:**
పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు భూభారతి చట్టంతో పరిష్కారం అవుతాయని ఆర్‌డిఓ పాండు అన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులో బుధవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆర్‌డిఓ పాండు పాల్గొని రైతులు అందచేసిన దరఖాస్తులను స్వీకరించారు. పట్టా ఇనాం లాంటి ఫీలింగ్ ప్రభుత్వం భూదార్ పోడు భూములకు సంబంధించిన పెండింగ్ ఉంటే దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, నాయబ్ తహసీల్దార్ అనుదీప్, సిబ్బంది మాధవి, మనోహర్, లక్ష్మణ్, నవీన్, నర్సింలు, రైతులు మైపాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి మొగులయ్య, బాలకొండ నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్జాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కాంగ్రెస్ నేతలు

**న్యాల్‌కల్, జూన్ 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇండ్ల నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ధరఖాస్తు చేసుకున్న పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, హద్నూర్ సొసైటీ చైర్మన్ ఎక్కెల్లి జగన్నాథ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, నాయకులు విలాస్‌రెడ్డి, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌కె భవన్ ముందు బిఆర్ఎస్ నాయకుల నిరసన


బిఆర్‌కె భవన్‌కు బయలెక్కుతున్న బిఆర్ఎస్ నాయకులు

**రామచంద్రాపురం, జూన్ 11, ప్రభాతవార్త:**
కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ ముందు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి బిఆర్‌కె భవన్‌కు చేరుకుని తమ నిరసన వ్యక్తం చేస్తూ కెసిఆర్‌కు మద్దతుగా నిలిచారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి బిఆర్ఎస్ శ్రేణులు రామచంద్రాపురంలోని శ్రీలక్ష్మీగార్డెన్స్‌కు చేరుకోగా ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో కెసిఆర్‌కు, బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు.

## త్రాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

### -అధికారుల హామీతో ధర్నా విరమించిన మహిళలు


మహిళలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ అశోక్‌కుమార్

**మర్కుక్, జూన్ 11, ప్రభాతవార్త:**
త్రాగునీటి కోసం మహిళలు ఖాళీబిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేసిన సంఘటన మండల పరిధిలోని వరదరాజ్‌పూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గత రెండు నెలలుగా మిషన్ భగీరథ త్రాగునీరు రాకపోవడంతో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా నీటి సరఫరాను పునరుద్ధరించకపోవడంతో ఖాళీబిందెలతో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఓ అశోక్‌కుమార్ సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి చేరుకొని రేపటి నుండి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

# కెసిఆర్‌కు మద్దతుగా తరలివెళ్లిన ఎమ్మెల్యే


కెసిఆర్‌కు మద్దతుగా బిఆర్ఎస్ నేతలతో హైదరాబాద్ వెళుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పిసి గోష్ కమిషన్ ముందు విచారణకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మద్దతుగా నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు వెంట బుధవారం తరలివెళ్లారు. హైద్రాబాద్‌కు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పెంటరెడ్డి, బిఆర్ఎస్ ఆయా మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, నర్సింలు, ఫాక్స్ చైర్మన్ మచ్చెందర్, న్యాల్‌కల్ మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఎల్‌చెల్ నర్సింహారెడ్డి, మాజీ కేతకి ఆలయకమిటీ చైర్మన్ నర్సింహాగౌడ్, మాజీసర్పంచ్‌లు, మాజీఎంపిటిసి సభ్యులు తరలివెళ్లారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### -పిఆర్‌టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు

**నాగల్‌గిద్ద, జూన్ 11, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు నాణ్యమైన విద్యను అందుకుంటారని పిఆర్‌టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సేరికర్ రమేష్, నాగనాథ్‌లు అన్నారు. ఉపాధ్యాయుల వర్క్ ఆడ్జెస్ట్‌మెంట్ ఈ నెల 12వ తారీఖులోపే చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర పిఆర్‌టియుసంఘం అభ్యర్థనమేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు జులై 15వ తేదీ వరకు పొడిగించేలా కృషి చేసిన ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులకు తమ వంతు సహకరించాలని సూచించారు.

## జహీరాబాద్‌లో బిఆర్ఎస్ నిరసనలు


బిఆర్‌కె భవన్ వద్ద బిఆర్ఎస్ నాయకుల నిరసన దృశ్యం

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కాళేశ్వరం విచారణను పురస్కరించుకుని జహీరాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ నేతలు బిఆర్‌కె భవన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్ మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా కాంగ్రెస్ చిత్రీకరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వర ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారంగా మారిందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయని గుర్తు చేశారు. కెసిఆర్, హరీష్‌రావులపై ఎన్ని విచారణలు చేపట్టినా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని రవికిరణ్ ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ యాకూబ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఫయాజ్, పరశురాం, రవి, నాయకులు సందీప్ రాజ్, నరేష్‌రెడ్డి, నిఖిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు గర్భిణి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ సంధ్యారాణి

**నాగల్‌గిద్ద, జూన్ 11, ప్రభాతవార్త:**
వైద్యం అందక మండల పరిధిలోని ఇరాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని లక్యానాయక్ తండాకు చెందిన నిండుగర్భిణి ఈనెల 9న మృతిచెందిన సంఘటనపై బుధవారం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ సంధ్యారాణి ఆరోగ్యకేంద్రానికి చేరుకుని విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ మే 26న నిండుగర్భిణి జయశ్రీ ఆసుపత్రికి చేరుకుని పరీక్షలు (బిపి, షుగర్) చేసుకోగా అన్నీ నార్మల్‌గా వచ్చాయని, డెలివరీ సమయంలో ఫిట్స్ రావడంతోనే జయశ్రీ తిరిగిరాని లోకాలకు చేరిపోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగ నిర్మల, ప్రోగ్రామ్ అధికారి మాథర్, చైల్డ్ హెల్డ్ అధికారి డాక్టర్ హరిణి, మెడికల్ అధికారి తూర్కపల్లి విక్టరియా రాణి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ శాంత, డాక్టర్ గిరి భాస్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదల తొలగింపు

**సిర్గాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అంతారం నుంచి పిట్లంకు వెళ్లే దారిలోని రోడ్డుకు ఇరువైపుల అలుముకున్న ముళ్ల పొదలను, చెట్ల కొమ్మలను అధికారులు తొలగింపచేశారు. నారాయఖేడ్ ఆర్‌టిసి డిపో నుంచి అంతర్గాం మీదుగా పిట్లంకు బస్సు నడుస్తున్నందున బస్సు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా పొదలను తొలగించారు.

## సిసి రోడ్డుపై వాటర్ క్యూరింగ్

**వార్త ప్రభావం**


సిమెంట్ రోడ్డుపై వాటర్ క్యూరింగ్‌కు కట్టలు కట్టిన దృశ్యం

**సదాశివపేట, జూన్ 11, ప్రభాతవార్త:**
రోడ్డును నిర్మించారు-వాటర్ క్యూరింగ్ మరిచారు అన్న శీర్షికతో ఈ నెల 11న ప్రచురతమైన ప్రభాతవార్త కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో గత 10రోజుల క్రితం నిర్మించిన సిసి రోడ్డుపై వాటర్ క్యూరింగ్ చేయకపోతుండటంతో రోడ్డు తేలిపోతున్న విషయాన్ని ప్రభాతవార్త వెలుగులోకితేగా స్పందించిన అధికారులు రోడ్డుపై కట్టలు కట్టించి వాటర్ క్యూరింగ్‌కు శ్రీకారం చుట్టారు. రోడ్డుపై వాటర్ క్యూరింగ్ అయ్యేలా వార్తను ప్రచురించిన ప్రభాతవార్తకు కాలనీ వాసులు అభినందించారు.

## నరేంద్ర మోడీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

**గుమ్మడిదల, జూన్ 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు కిషన్‌రెడ్డి పిలుపుమేరకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గుమ్మడిదల మండలం పరిధిలోని కొత్తపల్లి, నల్లవల్లి, బొంతపల్లి వీరన్నగూడెం మున్సిపల్ పరిధుల్లో భారతీయ జనతా పార్టీలో పర్యావరణ పరిరక్షణ వన్‌నేషన్ వన్‌ఎలక్షన్ కార్యక్రమంలో గుమ్మడిదలమండలం బిజెపి పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గ్రామాల్లో రేషన్‌దుకాణం సందర్శించి వర్షాకాలం మొదలవ్వడంతో ముందస్తుగా మూడునెలల రేషన్‌బియ్యం ఇవ్వడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొత్తపల్లి, నల్లవల్లిగ్రామాల్లో మొక్కలనునాటడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సోషల్‌మీడియా కోఆర్డినేటర్ సోమల్లా యాదగిరి, మండల కోశాధికారి రాజశేఖర్, ఉపాధ్యక్షులు దోమడుగు సంజీవ, ప్రధానకార్యదర్శి టి. రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డిగారి వీరారెడ్డి, కానుకుంట ముత్యాలుగౌడ్, సొమ్ముల సత్యనారాయణ కొత్తపల్లి జానావ, ఇందిరమ్మ, నల్లవల్లి రవీందర్ బొంతపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడు వేణుగోపాల్‌చారి, వీరన్నగూడెం మండల కమిటీ సభ్యుడు అంగడి శేఖర్, బొంతపల్లి అంజని శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.